

నేరాల మత్తు..!





- గంజాయి మత్తులో దాడులు, హత్యలు, అత్యాచారాలు
- పురంలో హెచ్చుమీరుతున్న విషసంస్కృతి
- భయాందోళనల్లో జనం
- తూతూమంత్రంగా తనిఖీలు

విచక్షణారహిత దాడులు..
హత్యలు.. అత్యాచారాలు..
వేటిని దర్యాప్తు చేసినా..
ప్రధానంగా తేలుతున్నది మత్తు..
చాలావరకు నేరాలకు
గంజాయి మత్తులోనే
పాల్పడుతున్నట్లు నిందితులే
ఒప్పుకుంటుండడంతో
పోలీసులు విస్తుపోతున్నారు..
పురం ప్రాంతంలో
గంజాయి సర్వసాధారణమైపోయింది..
గత వైసీపీ పాలనలో
దుకాణాల్లో కూడా దొరికింది..
ఇప్పుడు కూడా అడ్డుకట్ట పడలేదన్న
విమర్శలున్నాయి.
ఇందుకు ఇటీవలి నేరాలు..
వాటి దర్యాప్తులో వెలుగుచూస్తున్న
వాస్తవాలే నిదర్శనాలు..

హిందూపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హిందూపురం ప్రాంతంలో కత్తిపోటు అంటే అరుదు. అసలు ఈ విష సంస్కృతి ఈ ప్రాంతంలో ఉండేదికాదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మత్తుపదార్థాలు విచ్చలవిడిగా అందుబాటులోకి వచ్చాయి. గంజాయి చిల్లర కొట్టులో దొరికే పరిస్థితి దాపురించింది. చిన్నపిల్లలు సైతం గంజాయి సేవిస్తున్నారంటే అతియోశక్తికాదు. దీనినిబట్టి హిందూపురంలో గంజాయి లభ్యత ఏస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల గంజాయి మత్తులో కత్తులతో పొడవడం సర్వసాధారణమైంది. గత ఐదునెలల వ్యవధిలో హిందూపురం ప్రాంతంలో జరిగిన ప్రతినేరంలోనూ గంజాయి సేవించినవారు ఉండటం ఇందుకు అద్దం పడుతోంది.

గంజాయి మత్తులో..

- ఈ ఏడాది జూన్‌లో తూముకుంట పారిశ్రామిక వాడలో ఓ కార్మికుడు విధులకు వెళ్లి తిరుగు తిరిగి ఇంటికి వెళ్తుండగా గంజాయి మత్తులో ఉన్న యువకులు తీవ్రంగా దాడిచేసి, గాయపరిచారు.
- జూలై మొదటివారంలో హిందూపురం మండలం గోళ్లాపురంలో గంజాయి సేవించిన యువకులు.. ఒక వ్యక్తిని కిరాతకంగా కొట్టి చంపేశారు. పోలీసుల విచారణలో వారు గంజాయి సేవించిన మత్తులో చంపేసినట్లు విచారణలో వెల్లడైంది.
- జూలైలో తూముకుంట చెక్‌పోస్టు సమీపాన ద్విచక్రవాహనంపై హిందూపురం వైపు వస్తున్న వారిని ఆపి, వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్ లాక్కుని తీవ్రంగా దాడిచేశారు. ఇందులో ఓ యువకుడి వద్ద కత్తికూడా ఉన్నట్లు తెలిసింది.
- అక్టోబరులో చిలమత్తూరు మండలంలో సామూహిక అత్యాచారానికి ఒడిగట్టిన నిందితులు గంజాయి సేవించినట్లు సమాచారం.
- గతవారం పట్టణంలోని శాంతిటాకీస్ సమీపంలో ఓ యువకుడు ద్విచక్రవాహనం అడిగితే ఇవ్వనందుకు వ్యక్తిపై కత్తితో దాడిచేశాడు. అడ్డొచ్చిన మరో ఇద్దరిపై కూడా కత్తిపోట్లు పడ్డాయి. సదరు యువకుడు గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.
- మూడు రోజుల క్రితం మోతుకపల్లి వద్ద స్నేహితులే పరస్పరం దుర్భాషలాడుతూ కత్తితో పొడిచారు. ఇవి మచ్చుకు మాత్రమే. గతంలో ఇలాంటివి చాలా జరిగాయి. పోలీసులు గుట్టుగా ఉంచారన్న విమర్శలున్నాయి.

అరికట్టకపోతే తీవ్ర పరిణామాలు

ఒకప్పుడు కత్తులతో దాడులు, హత్యలు, అత్యాచారాలు హిందూపురం ప్రాంతంలో చాలా అరుదు. ఇతర ప్రాంతాలవారే నేరాలకు పాల్పడేవారు. ఇటీవల జరిగిన హత్యలు, అత్యాచారాలు, కత్తులతో పొడుచుకోవడం వంటివి చూస్తుంటే హిందూపురం ప్రాంతంలో ఈ విషసంస్కృతి విస్తరించినట్లు తెలుస్తోంది. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టకపోతే భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని జనం బెంబేలెత్తుతున్నారు. వారికి నమ్మకం కలిగించాల్సిన పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఘటన జరిగినపుడు హడావుడి చేస్తారు తప్ప.. ఆ తరువాత పోలీసుల్లో ఎలాంటి చలనం ఉండకపోవడం శోచనీయం. ఏదిఏమైనా గంజాయి మత్తులో జరుగుతున్న నేరాలను అరికట్టకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నామమాత్రంగా తనిఖీలు



కూటమి అధికారం చేపట్టాక గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని పోలీసు ఉన్నతాధికారులు ప్రకటనలు ఇచ్చారు. కొత్త పోలీసు అధికారులు వచ్చారు. వాటి ఆటకట్టిస్తారని చెప్పారు. కొత్త పోలీసు అధికారి వచ్చినా ఏళ్లతరబడి హిందూపురంలో పాతుకుపోయిన పోలీసులు.. గంజాయి వ్యాపారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీంతో గంజాయి నిర్మూలన పేపర్ ప్రకటనకే పరిమితమైందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొత్తగా వచ్చిన పోలీసు అధికారులు మొదట హడావుడి చేసినా.. ఆ తరువాత ఏం జరిగిందో కానీ దానిపై దృష్టిపెట్టినట్లు కనిపించలేదు. పోలీసులు కూడా తూతూమంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాత్రం గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని పేర్కొంటుండగా.. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అయినా క్షేత్రస్థాయిలో గంజాయిని నిర్మూలించకపోగా.. కొత్తరకం మత్తు మందు హిందూపురంలో విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసు తనిఖీలు ఉత్తుత్తివేనన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

గంజాయిపై స్పెషల్ డ్రైవ్ పెట్టాం



హిందూపురం సబ్‌డివిజన్‌లో గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గంజాయి క్రయవిక్రయాల్లో ఉన్నవారిని అరెస్టు చేశాం. మరికొంతమందిపై కూడా నిఘా పెట్టాం. వారిని కూడా త్వరలోనే పట్టుకుంటాం. ఇటీవల జరిగిన ఘటనలో కొంతమంది గంజాయి, మరికొంతమంది మద్యం మత్తులో కూడా ఉన్నారు. ఏదిఏమైనా గంజాయి, మత్తు పదార్థాలపై ఉపేక్షించేదిలేదు. అలాంటి వారిపై చర్యలతోపాటు అవసరమైతే జిల్లా బహిష్కరణ చేయడానికి కూడా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తాం.

- మహేష్, డీఎస్పీ, హిందూపురం

సొంత అవసరాలకు ఇసుక ఉచితం

కలెక్టర్ టీఎస్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సొంత అవసరాలకు ఎడ్లబండి, ట్రాక్టర్ ద్వారా ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఉచిత ఇసుక అమలుపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల పరిధిలోని నదుల నుంచి సొంత అవసరాలకు ఇసుక ఉచితంగా తీసుకెళ్లవచ్చాన్నారు. ఇసుకను తోడేందుకు యంత్రాలను ఉపయోగించరాదన్నారు. ఉచిత ఇసుక విధానం ద్వారా అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రీచ్‌ల నుంచి ఇసుక అవసరమైన వారు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇసుక పంపిణీ పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిని నియమించామన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ.. సరిహద్దు ప్రాంతాలలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. అక్రమ నిల్వలపై దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, గనులశాఖ అధికారి పెద్దిరెడ్డి, ఆర్డీఓ కరుణాసాగర్‌రెడ్డి, జలనవరుల శాఖ అధికారి మల్లికార్జునయ్య, ధర్మవరం ఆర్డీఓ మహేశ్ పాల్గొన్నారు.

పురానికి తీరిన నీటి కష్టం



యంత్రాలకు పూజచేస్తున్న కమిషనర్

హిందూపురం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎట్టకేలకు నీటి కష్టాలు తీరాయి. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరు సరఫరా చేసే పథకంలో భాగంగా పెనుకొండ సమీపంలోని ఎస్కేడీ వద్ద ఏర్పాటు చేసిన సంపులో మోటారు మరమ్మతులు పూర్తి చేసి, బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, డీఈ బాలసుబ్రహ్మణ్యం మోటారుకు పూజలు చేసి, ప్రారంభించారు. మోటారు రిపేరీకి రావడంతో 15 రోజులకోసారి పట్టణవాసులకు నీరు సరఫరా అవుతుండేది. దీంతో మోటారును బెంగళూరు తీసుకెళ్లి, మరమ్మతులు చేయించారు. సిద్ధం కావడంతో బుధవారం ప్రారంభించారు. మరమ్మతుల బారిన పడిన మరో మోటారును కూడా బెంగళూరుకు పంపామనీ, దానిని కూడా సిద్ధం చేసి నీటి సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని కమిషనర్ తెలిపారు.

ఆముదం సాగుతో లాభాలు

- వ్యవసాయ శాస్త్రవేత్తలు

బత్తలపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆముదం పంట సాగుతో లాభాలు పొందవచ్చని శాస్త్రవేత్తలు మంజునాథ్, విజయ్‌శంకర్ బాబు పేర్కొన్నారు. పంట సాగుకు ఇక్కడి వాతావరణం చాలా అనుకూలమన్నారు. మండలంలోని జ్వాలాపురంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడారు. గుజరాత్‌లో ఆముదం రైతులు ఎకరాకు 30 క్వింటాళ్లు పండిస్తున్నారన్నారు. ఆముదం పంటలో నులిపురుగుల నివారణకు డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, శాస్త్రవేత్తలు నజీరుద్దీన్, భాస్కర్‌రావు, మాధవి, లక్ష్మి, కల్యాణి, ఏఓ ఓబిరెడ్డి పాల్గొన్నారు.

భవిత ఛిద్రం..!

హాకీ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ.. జాతీయస్థాయికి ఎంపిక
ఆనందంలో ఇంటికొస్తూ.. రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి.. తండ్రికి తీవ్రగాయాలు

7

కౌశల్ పోటీలకు నమోదు చేసుకోండి: డీఈఓ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ, అధికారులు

కొత్తచెరువు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కౌశల్ ప్రతిభాన్వేషణ పోటీలకు ఈనెల 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కిష్టప్ప తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాల నుంచి 8, 9, 10 తరగతుల నుంచి 9 మంది విద్యార్థుల పేర్లు, మొబైల్ నంబర్లతోపాటు ఈనెల 15లోగా www.bvmap.org పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పోస్టర్-1లో 8వ తరగతిలోని ఇద్దరు విద్యార్థులు వ్యర్థపదార్థాల పునర్ వ్యవస్థీకరణపైనగానీ, జీవవైవిధ్యం, మృత్తికారోగ్యంపైగానీ పోటీ పరీక్షలు ఉంటాయన్నారు. పోస్టర్-2లో 9వ తరగతిలోని ఇద్దరు విద్యార్థులకు సర్ సీవీ రామన్ జీవితం, పరిశీలనలు ఉంటాయన్నారు. షార్ట్స్‌గానీ రీల్స్‌గానీ పదో తరగతిలోని ఇద్దరు విద్యార్థులకు సులభ సూత్రాలను ఉపయోగించి, విలువ కనుగొనడం లేదంటే 17వ శతాబ్దం నాటి భారతీయ శాస్త్రవేత్తల పరిశోధనలపై నవంబరు 20, 21, 22 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రథమ బహుమతి కింద క్విజ్‌లో (తరగతికి ఒకరు చొప్పున మొత్తం ముగ్గురికి) రూ.4500, ద్వితీయ బహుమతి కింద రూ.3 వేలు, పోస్టర్ 1, 2 షార్ట్స్ లేదా రీల్స్‌లో ప్రథమ బహుమతి కింద రూ.15వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.1000 అందజేస్తారన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు నాగరాజు, రామకృష్ణ, లాజర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్టకిందపల్లి వద్దగల పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 8న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాను రెండు కంపెనీల ప్రతినిధులు నిర్వహిస్తున్నారన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తిచేసి 18 నుంచి 30 ఏళ్లలోపువారు అర్హులన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకుని ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9182288465 నంబరులో సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

జేడీఏకి ఎరువుల డీలర్ల సంఘం వినతి



ఉమామహేశ్వరమ్మను సన్మానిస్తున్న డీలర్ల సంఘం అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు, నాయకులు గంగాధర్, రమేష్, రంగయ్య

అనంతపురం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మకు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు విన్నవించారు. డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ఉపాధ్యక్షుడు గంగాధర్, కోశాధికారి రమేష్, రంగయ్య తదితరులతో కలిసి బుధవారం ఆయన జేడీఏను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన కార్యవర్గానికి జేడీఏ శుభాకాంక్షలు తెలియజేశారు. డీలర్ల సమస్యలు ఎవైనా తన దృష్టికి తీసుకువస్తే, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రజాపోరును జయప్రదం చేయండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



ప్రజాపోరు బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారాన్ని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 14వతేదీ వరకు చేపట్టనున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజాపోరు బ్రోచర్లను బుధవారం ఆవిష్కరించారు. నెలరోజులుగా కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంట నూనెల ధరలు భారీగా పెరుగుతున్నాయని అన్నారు. పండుగలు, రోజువారి సరుకుల కొనుగోళ్లలోనూ ధరల ప్రభావం కనిపిస్తోందని అన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల అదుపుకోసం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశకు గురవుతోందని అన్నారు. డీఎస్సీ వాయిదా పడిందని, గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీ అగమ్యగోచరంగా ఉందని అన్నారు. కోచింగ్ తీసుకున్న యువత అయోమయంలో ఉందని, వెంటనే రిక్రూట్మెంట్ ప్రారంభించి ఉపాధి కల్పించాలని కోరారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు పెరుగుతున్నాయని అన్నారు. ఆచూకీ కనపడని ఆడపిల్లల సంఖ్య పెరుగుతోందని, గత ప్రభుత్వానికన్నా భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి వాగ్దానాలు అమలులోకి రాలేదని అన్నారు. అవినీతి విచ్చలవిడిగా సాగుతోందని అన్నారు. ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయని అన్నారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమల్లోకి రాలేదని అన్నారు. విద్యుత్ చార్జీలను పెంచబోమంటూనే ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.20వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేశారని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నగర కార్యదర్శి వెంకటనారాయణ, సీపీఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు అలేఖ్య



బరువులు ఎత్తుతున్న అలేఖ్య

రామగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కుంటిమద్ది ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అలేఖ్య ఎంపికైనట్లు హెచ్ఎం అనంతపద్మానాభులు, పీడీ నాగేశ్‌బాబు బుధవారం తెలిపారు. ఈ నెల 2, 3, 4తేదీలలో తెనాలిలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ అండర్-17 వెయిట్‌లిఫ్టింగ్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారని తెలిపారు. డిసెంబరులో మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

అమ్మ చదివితే ఇంటిల్లిపాదికీ ప్రయోజనం: కలెక్టర్



ప్రశాంతి జిల్లా సమాఖ్య వార్షికోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమ్మ విద్యావంతురాలైతే ఇంటిల్లిపాదీ విద్యావంతులు, ప్రయోజకులు అవుతారని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ప్రశాంతి జిల్లా సమాఖ్య 20వ వార్షిక మహాజన సభను టీటీడీసీలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్.. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తన తల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పనిచేసే సమయంలో తనను వెంట తీసుకెళ్లేవారని అన్నారు. ఆ సమయంలో మహిళల బాగోగులు, ఆరోగ్యం గురించి తన తల్లి అడిగి తెలుసుకునేవారని గుర్తు చేసుకున్నారు. తన తల్లి ప్రోత్సాహం, తండ్రి సహకారం, అక్క మమకారమే తనను ఐఏఎస్ స్థాయికి చేర్చాయని తన వ్యక్తిగత జీవితాన్ని పంచుకున్నారు. తల్లి చదివితే ఇంటిల్లిపాదీ విద్యావంతులు అవుతారని, ఇది తనకు బాగా వర్తిస్తుందని అన్నారు. ప్రతి మహిళా చదివి, స్వయం ఉపాధితో సొంత కాళ్లపై నిలబడాలని, ఆర్థిక సాధికారత సాధించి సమాజంలో నిర్ణయాత్మకశక్తిగా మారాలని ఆకాంక్షించారు. డ్వాక్రా మహిళలు ఐక్యత, నిబద్ధత, ఆర్థిక క్రమశిక్షణకు చిహ్నాలుగా నిలుస్తున్నాయని కొనియాడారు. మహిళ అభివృద్ధి సమాజాభివృద్ధికి బాటలు వేస్తుందని అన్నారు. డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేయడానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, పేదరికం నుంచి విముక్తి పొందాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలను అరికడదాం..

బాల్య వివాహాల నివారణలో డ్వాక్రా మహిళలు భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి కోరారు. భ్రూణ హత్యలను అరికట్టాలని, మహిళలపై దాడులను ఐక్యంగా తిప్పికొట్టాలని అన్నారు. మహిళల అభివృద్ధికి వంద రోజుల ప్రణాళికతో సమష్టిగా కృషి చేస్తున్నామని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. బ్యాంకు రుణాలతో ఆర్థిక సాధికారత దిశగా డ్వాక్రా సంఘాలు అడుగులు వేస్తున్నాయని అన్నారు. ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు షేక్‌న్ బీ వార్షిక నివేదిక ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు భానుజా, ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యదర్శి రాధమ్మ, ఉపాధ్యక్షురాలు సుజాత, సహాయ కార్యదర్శి సుహాసిని, కోశాధికారి లలిత, డీఆర్‌డీఏ-వెలుగు డీపీఎంలు రాధారాణి, జిలాన్, సత్యనారాయణ, గంగాధర్, రవీంద్రబాబు, రాజ్యలక్ష్మి, శివప్రసాద్, హనుమేష్, అనిత తదితరులు పాల్గొన్నారు.

కుయ్ కుయ్.. నయ్ నయ్..!

అత్యవసర వేళల్లో ఫోన్ చేయగానే.. కుయ్ కుయ్ అంటూ వచ్చే 108 వాహనాలు ఇపుడు నయ్ నయ్ అంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ వాహనాల నిర్వహణ బాధ్యతలను ఆ పార్టీ కీలకనేత అల్లుడికి కట్టబెట్టింది. ఈ సంస్థ జనం ఆరోగ్య సేవల కన్నా సొంత లాభానికే అధిక ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ సొమ్మును దోపిడీ చేసిందని విమర్శలు ఉన్నాయి. సరైన నిర్వహణలేక చాలా వాహనాలు దెబ్బతిన్నాయి. దీంతో రోగులను తీసుకొచ్చేటపుడు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. మరోవైపు వాహనాలు కండీషన్‌లో లేకపోవడంతో నిరంతరం ప్రమాదాలకు గురవుతున్నాయి. వీటి నిర్వహణ చూసే అరబిందో సంస్థ ఏమాత్రం పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. *ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్*



రాప్తాడులో గ్యారేజీ వద్ద పడిఉన్న 108 వాహనాలు

ప్రమాదపుటంచున 108 వాహనాలు

- మరమ్మతులు లేక మొండికేస్తున్న వైనం
- బాధ్యతల నుంచి తప్పుకున్న అరబిందో
- మూడు రోజులుగా డీజిల్ సమస్య
- ఆగిపోనున్న అత్యవసర సేవలు



జిల్లా కేంద్రంలో చెడిపోయి నిలిచిపోయిన 108 వాహనం

దారి మధ్యలో ఆగుతున్నాయ్..

బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించి వైద్యసేవలు అందేలా చూసి ప్రాణాలు కాపాడే 108 వాహనాలే ప్రమాదంలో పడిపోయాయి. అధికారిక లెక్కల ప్రకారం అనంతపురం జిల్లాలో 108 వాహనాలు 33 నడుపుతున్నారు. ఎక్కడైనా ప్రమాదం ఉంటే 20 నిమిషాలలోపు అక్కడికి వెళ్లి రోగిని తీసుకొని ఆసుపత్రికి తీసుకెళ్లాలి. కానీ వాహనాలు దెబ్బతినడంతో రోగులు కాల్‌చేసినా గంటలకొద్దీ చేరుకోలేక పోతున్నాయి. ఒకవేళ సమయానికి వెళ్లినా మధ్యలో ఏ టైరు ఎక్కడ పంక్చర్ అవుతుందో.. ఎక్కడ ఏది ఊడిపోయి నిలబడుతుందో తెలియని పరిస్థితి. ఇటీవల కూడేరు, ఉరవకొండ, బెళుగుప్ప, అనంతపురంరూరల్, రాప్తాడు మండలాల పరిధిలో 108 వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. మరికొన్ని వాహనాలు చెడిపోయి మధ్యలో ఆగిపోయాయి. ఆ సమయంలో రోగులు నరకం చూడాల్సి వస్తోంది. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు మరమ్మతులతో రాప్తాడు వద్ద గ్యారేజ్‌లో క్యూ కడుతున్నాయి.



జిల్లా ఆసుపత్రికి రోగులను తీసుకొచ్చిన 108 వాహనాలు

డీజిల్ కష్టాలు

నిర్వహణ తీరుపై ప్రభుత్వం ఇప్పటికే సంస్థను హెచ్చరించింది. ఈ నేపథ్యంలో 108 వాహనాలు నిర్వహణ చూస్తున్న అరబిందో సంస్థ బాధ్యతల నుంచి తప్పుకుంది. టెండర్ ద్వారా మరో కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో గత మూడు రోజులుగా 108 వాహనాల నిర్వహణ మరింత దారుణంగా మారింది. డీజిల్‌కు డబ్బుల్లేక అనేక వాహనాలు ఆగిపోయాయి. గతంలో రోజుకు ఒక్కొక్క వాహనానికి రూ.5వేలు క్రెడిట్ కార్డులోకి వేసేవాళ్లు. దాని ద్వారా అవసరమైనచోట కార్డు పెట్టి డీజిల్ వేయించుకునేవారు. నిర్వహణ సంస్థ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో గత మూడు రోజులుగా డీజిల్‌కు డబ్బులు వేసేవారులేరు. ఇప్పటికే 10 వాహనాలకు పైగానే డీజిల్‌కు డబ్బుల్లేక నిలిపివేసినట్లు సమాచారం. ఇలాగే సాగితే మరో రెండురోజుల్లో మొత్తం వాహనాలు నిలిచిపోతాయి. జిల్లా అధికారులు స్పందించకపోతే సమస్య మరింత జఠిలమై అత్యవసర సేవలకు అంతరాయం కలిగే ప్రమాదం ఉంది.

మాచేతుల్లో ఏమీలేదు

108 వాహనాల నిర్వహణ బాధ్యతల నుంచి అరబిందో సంస్థ తప్పుకుంది. మళ్లీ నిర్వహణ ఎవరు చూస్తారో మాకు తెలియడంలేదు. ప్రతిరోజూ డీజిల్‌కు సంస్థ రూ.5వేలు క్రెడిట్ కార్డులో జమ చేసేది. గత మూడు రోజులుగా డీజిల్‌కు డబ్బులు వేయడంలేదు. సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. దీంతో వారు కూడా పట్టించుకోలేదు. డీజిల్ అయిపోయిన వాహనాలను ఎక్కడికక్కడ నిలిపేశారు. అత్యవసర సేవలకు డీజిల్ ఉన్న వాహనాలను పంపిస్తున్నాం. ఇంతకన్నా మేమేమీ చేయలేం. ప్రభుత్వమే తగిన చర్యలు తీసుకోవాలి.

- కొండారెడ్డి, 108 జిల్లా ఇన్‌చార్జ్ కో-ఆర్డినేటర్

మా దృష్టికి రాలేదు : డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

108 వాహనాల నిర్వహణ మా పరిధిలో ఉండదు. అవి సక్రమంగా తిరుగుతున్నాయా లేదా అని మాత్రమే పరిశీలిస్తుంటాం. డీజిల్‌కు డబ్బులు లేవని, వాహనాలు నిలబడుతున్నాయని మాకు ఎవరూ చెప్పలేదు. ఒకవేళ చెబితే ఈ విషయాన్ని కలెక్టర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం. సమస్యలు లేకుండా చూస్తాం. వాటి నిర్వహణ నిధులు వైద్యశాఖ పరిధిలో ఉండవు.

రైతుల మధ్య దొంగల చిచ్చు

పొలాల్లో మోటార్లు, కేబుల్ చోరీ

గోపరాజుపల్లి యువకులపై ఫిర్యాదు

కుందేలు వేటకు వచ్చామన్న యువకులు



శింగనమల పోలీస్ స్టేషన్ వద్ద రెండూళ్ల రైతులు

శింగనమల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పొలాలలో వ్యవసాయ మోటార్లు, కేబుల్ వైర్ల చోరీ వ్యవహారం రెండు గ్రామాల రైతుల మధ్య విభేదాలను రాజేసేలా ఉంది. మండల పరిధిలోని నిదనవాడ పొలాల్లో రెండురోజులకోసారి పొలాల్లో మోటార్లు, కేబుల్ మాయమౌతోంది. దీంతో రైతులు ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలో పెద్దవడుగూరు మండలం గోపరాజుపల్లి గ్రామ యువకులు మంగళవారం రాత్రి పొలాల వద్ద కనిపించడంతో నిదనవాడ రైతులు వారిని చితకబాది శింగనమల పోలీసులకు అప్పగించారు. అయితే, తాము కుందేళ్ల వేటకు వచ్చామని ఆ యువకులు అంటున్నారు. ఈక్రమంలో రెండు గ్రామాల రైతులు బుధవారం పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చారు. పరస్పరం వాగ్వాదానికి దిగారు. 'మా పిల్లలు కుందేళ్ల వేటకు వచ్చారు. మీ భూములు, మా భూములు అక్కడే కదా ఉన్నాయి..? రోజూ మమ్మల్ని చూస్తూనే ఉన్నారు కదా..? వారిని పట్టుకుని ఎలా కొడతారు..?' అని గోపరాజుపల్లి రైతులు ప్రశ్నించారు. పొలాల వద్దకు రాకుండా ఉంటారా.. చూద్దాం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటపాటు ఉద్రిక్తత కొనసాగడంతో పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపేశారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. పొలాల వద్ద మోటార్లు, రాగి వైరు చోరీ అవుతోందని, ఈ క్రమంలో పొలాల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురు యువకులను పట్టుకున్నామని నిదనవాడ రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకులను విచారిస్తున్నామని ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు. మొత్తంగా దొంగల వ్యవహారం రైతుల మధ్య విభేదాలను రాజేసేలా కనిపిస్తోంది. పోలీసులు సమగ్రంగా విచారించి, మునుముందు సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉంది.

5వేల కేసుల రాజీనే లక్ష్యం

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్.. జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో 5వేల కేసులను రాజీ కుదర్చడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించనున్నట్లు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని కోర్టుల్లో పెండింగులో ఉన్న మోటారు వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేస్తామన్నారు. సంబంధిత కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ఏడాదిలో ఇది చివరి జాతీయ లోక్ అదాలత్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లలో వెలువడే తీర్పులు అంతిమం అన్నారు. సివిల్ కేసులలో రాజీ అయిన వారికి కోర్టు కట్టిన ఫీజులు వెనక్కు తీసుకునే అవకాశం ఉందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ కావడం ద్వారా ఇరు పార్టీలు నెగ్గినట్లవుతుందని తెలిపారు. దీంతో గతంలోలాగా వారి స్నేహ సంబంధాలు కొనసాగుతాయన్నారు. ఇంతకు ముందు జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 6వేల కేసులను రాజీ కుదిర్చామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్, జిల్లాలోని వివిధ కోర్టుల న్యాయాధికారులు పాల్గొన్నారు.

వివిధ కోర్టుల న్యాయాధికారులు



డ్యాం గేటుకు గోడ

లీకేజీలు అరికట్టే పేరిట నిర్మాణం.. ప్రమాదం జరుగుతుందని రైతుల ఆందోళన



సుబ్బరాయసాగర్ గేటుకు అడ్డంగా కట్టిన గోడ

పుట్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సుబ్బరాయసాగర్ డ్యాం గేటు దెబ్బతినడంతో ఇంజనీరింగ్ అధికారి అక్కడ గోడ కట్టించారు. మరమ్మతు చేయించకుండా ఇలా గోడ కట్టించడం ఏమిటని రైతులు అభ్యంతరం చెబుతున్నారు. డ్యాం సామర్థ్యం అర టీఎంసీ కాగా, తుంపెర డీప్ కట్ నుంచి డ్యాంలోకి నీరు చేరుతోంది. ఒక గేటు దెబ్బతిన్న కారణంగా 20 క్యూసెక్కుల నీరు వృథాగా వెళుతోంది. దీంతో నీటి నిల్వలను కాపాడేందుకు గేట్లను మూసివేయించారు. భారీగా నీరు చేరితే గేటు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని భావించిన అధికారి.. గోడ కట్టించారు. రెండు గేట్ల ద్వారా పుట్లూరు మండల పరిధిలోని మూడు చెరువులకు, 29వ డిస్ట్రిబ్యూటరీకి నీటిని విడుదల చేస్తుంటారు. గోడ కట్టిన కారణంగా ఇకపై గేటు నుంచే నీరు దిగువకు వదలాల్సి ఉంటుంది. ఒత్తిడి పెరిగితే ఆ గేటు కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గోడకట్టిన విషయం తెలుసుకున్న సంజీవపురం, కడవకల్లు రైతులు డ్యాం వద్దకు వెళ్లి అధికారులను ప్రశ్నించారు. గేటుకు గోడ కట్టడం వల్ల డ్యాంకు ప్రమాదం తలెత్తుతుందని టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు. లీకేజీ నీటిని డ్యాం కింద ఉన్న అరటి తోటలకు వాడుతున్నారని, వృథా కావడం లేదని అన్నారు. ప్రతి రోజూ 20 క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నందుకే గోడ కట్టించామని హెచ్చెల్సీ ఏఈ శ్రీనివాసులు అన్నారు. ఉన్నతాధికారులు చెబితే గోడను కూల్చివేయిస్తామని తెలిపారు.

ఎస్సీ వెల్ఫేర్ డీడీగా ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ శాఖ కార్యదర్శి కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి కర్నూలు ఎస్సీ వెల్ఫేర్ డీడీగా విధులు నిర్వర్తిస్తూ... అదే జిల్లాలోని 'కుడా'లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఆయనను అనంతపురం జిల్లా ఎస్సీ వెల్ఫేర్ డీడీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నేడో రేపో ఆయన బాధ్యతలు తీసుకోనున్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

అర్హులందరికీ డ్రిప్ పరికరాలు

ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన రైతులందరికీ డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం గుంటూరు నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, డ్రిప్ కంపెనీ ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. డ్రిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు సంబంధించి రైతు సేవా కేంద్రం సిబ్బందితో ప్రాథమిక పరిశీలన చేయించాలన్నారు. ఈ పరిశీలనలో రిజిస్ట్రేషన్ చేసుకొని తమ వాటా చెల్లించేందుకు సుముఖత లేని రైతుల వివరాలను సేకరించాలన్నారు. రాబోవు ఐదు నెలల్లో అర్హత కలిగిన ప్రతి రైతుకు డ్రిప్, స్ప్రింకర్లు మంజూరు చేయాలన్నారు.

జింకా.. ఏమయ్యావే..!





ప్రమాదంలో మృతిచెందిన జింక, సాయంత్రానికి చెట్ల కొమ్మల కిందకు చేరిన కళేబరం

విడపనకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బళ్లారి-ఉరవకొండ జాతీయ రహదారిపై పెద్దకొట్టాలపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని బుధవారం ఉదయం ఓ జింక మృతిచెందింది. ఈ విషయాన్ని పోలీసు, అటవీశాఖ అధికారుల దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకువెళ్లింది. అటవీశాఖ అధికారులు సాయంత్రం వరకూ అక్కడికి రాలేదు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు జింక కళేబరాన్ని రోడ్డు పక్కన కానుగ చెట్లకింద దాచారు. ఈ విషయాన్ని కూడా అటవీశాఖ అధికారుల దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకువెళ్లింది. వారు నింపాదిగా వచ్చేసరికి జింక కళేబరం మాయమైంది. ఏమైందని ఆ శాఖ అధికారులను అడిగితే.. 'మా అధికారి ఒకరు వచ్చి పూడ్చిపెట్టారు..' అని సమాధానమిచ్చారు. 'పూడ్చిన ఫొటో ఇవ్వండి సర్' అని అడిగితే.. 'మా వాడి వద్ద కీ ప్యాడ్ సెల్ మాత్రమే ఉంది. ఫొటో తీయలేదు..' అన్నారు. ఇంతకూ జింక ఖననమైందా..? ఖతమైందా..? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

కేజీబీవీ పోస్టులకు 68 మంది ఎంపిక

కలెక్టర్ ఆమోదం

రేపు అభ్యర్థులకు ఉత్తర్వులు

అనంతపురం విద్య, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీ పోస్టులకు 68 మందిని ఎంపిక చేసినట్లు సమగ్రశిక్ష అధికారులు తెలిపారు. విద్యాశాఖ, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులతో దీనిపై ఇప్పటికే కలెక్టర్ చర్చించారు. అభ్యర్థుల తుది జాబితాకు ఆయన ఆమోదం తెలిపారు. విశ్వసనీయ అధికారుల సమాచారం మేరకు.. సీఆర్టీ పోస్టులకు 20 మంది, పీజీటీ పోస్టులకు 21 మంది, అకౌంటెంట్స్ 4, పార్ట్ టైం టీచర్ పోస్టులకు 16 మందిని వార్డెన్ పోస్టులకు 7 మందిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. పూర్తిగా అకడమిక్ మెరిట్ ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేశామని అధికారుల వర్గాలు పేర్కొంటున్నాయి. నెల రోజుల కిందటే కసరత్తు సాగినా... రాజకీయ ఒత్తిళ్లు, జిల్లా విద్యాశాఖాధికారి బదిలీ కావడం, ఇతర కారణాల వల్ల తీవ్ర జాప్యమైంది.

రేపు ఉత్తర్వులు...

ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం పోస్టింగ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ప్రాజెక్టు ఏపీసీ నాగరాజు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల సెల్‌ఫోన్లకు ఇప్పటికే మెసేజ్‌ల ద్వారా సమాచారం ఇచ్చామన్నారు. సమాచారం అందుకున్న అభ్యర్థులంతా శుక్రవారం ఉదయం 10 గంటలకు సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకోవాలన్నారు. నియామక కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ గుర్తింపు కార్డులను వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

పీఏబీఆర్ సామర్థ్యం పెంచేందుకు చర్యలు

పెండింగ్ భూసేకరణపై దృష్టి సారించాలి: కలెక్టర్ వినోద్‌కుమార్





సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, హెచ్చెల్సీ భూసేకరణ అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలవ (టీబీపీ హెచ్చెల్సీ) పరిధిలోని పీఏబీఆర్ పూర్తి సామర్థ్యం 11 టీఎంసీల నీటి నిల్వలు పెంచేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని హెచ్చెల్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక బుడ్డప్పనగర్‌లోని హెచ్చెల్సీ భూసేకరణ అధికారి కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ చేసి, పీఏబీఆర్ పెండింగ్ భూసేకరణ, నిధులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్చెల్సీ పరిధిలోని ఉన్న కూడేరు మండలంలోని పెన్నా అహోబిళం రిజర్వాయర్ (పీఏబీఆర్) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 11టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేస్తున్నారన్నారు. పెండింగ్ భూసేకరణ చేపట్టి త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 11టీఎంసీల నీటి నిల్వ చేయడానికి ఉరవకొండ మండలంలోని మైలారంపల్లి, పెద్దకౌకుంట్ల, రాకెట్ల, బెళుగుప్ప మండలంలోని కోనంపల్లి, బూదిగుమ్మ, అంకంపల్లి, కూడేరు మండలంలోని ఎంఎం హళ్లి, జయపురం, కొర్రకోడు గ్రామాల పరిధిలో సుమారు 3,026 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. పెండింగ్ భూసేకరణకు సంబంధించిన నివేదికను వెంటనే తయారుచేసి అందజేయాలన్నారు. హెచ్చెల్సీ ఇంజనీర్లతో కలిసి పూర్తి స్థాయి నీటి నిల్వకు తలెత్తే సాంకేతిక సమస్యలు, వాటి పరిష్కారాలపై అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, హెచ్చెల్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్


ద్వితీయస్థానంలో నిలిచిన జట్టు

బాలికల హాకీ జట్టుకు ద్వితీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయిలో జిల్లా బాలికల హాకీ జట్టుకు ద్వితీయ స్థానం దక్కింది. ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఎస్‌జీ ఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ బాలికల పోటీలో జిల్లా జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించింది. ఇందు లో మెరుగైన ప్రతిభ చాటిన సంధ్య, యామిని, మిరాంబీ, సాయిభవ్యలు ఈనెల 17వతేదీ నుంచి హర్యాణాలో నిర్వహించే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జట్టుతో పాటు జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులకు ఎస్‌జీఎఫ్ ఉభయ జిల్లాల కార్యదర్శులు సుగుణాబాయి, మొరార్జీయాదవ్, మేనేజరు గట్టు నాగరాజు, పీడీలు శ్రీనివాసులు, రాకేష్, ప్రతాప్ అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన నార్పల విద్యార్థులు

నార్పల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బా లుర ఉన్నత పాఠశా ల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ట్లు పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. నెట్‌బాల్ అండర్-17 విభాగంలో రామ్‌చరణ్, అండర్-14లో సాయిమాధవ్ ప్రతిభ చూపారన్నారు. అలాగే బేస్‌బాల్ అండర్-17లో హేమంత్‌కుమార్‌రెడ్డి, అండర్-14లో గురుప్రవీణ్, సాఫ్ట్‌బాల్ అండర్-14లో మహేష్, హాకీ అండర్-14లో మహ్మద్ అజీజ్ అనే విద్యార్థులు ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారిని పాఠశాల హెచ్‌ఎం, పీడీ అంజనేయులు, పీఈటీ నమీమబేగం అభినందించారు.

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 30తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 975 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 25, కనిష్ఠ ధర రూ. 13 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 32 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 32వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 15 వేలు, సరాసరి రూ. 25 వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 52 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

980 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 980క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే అవుట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్-2కు 1044 క్యూసెక్కులు వెళుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.644 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకురావాలి : జీఎం

అనంతపురం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలు స్థాపించేందుకు ఔత్సాహికులు ముందుకు రావాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పరిశ్రమల శాఖ జిల్లా కార్యాలయంలో యూనియన్ బ్యాంక్, పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ అధికారులు, సిబ్బంది పారిశ్రామిక ఔత్సాహికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకులకు సంబంధించి నారీశక్తి, సువిధ పథకం, స్టాండ్ అప్ ఇండియా, విశ్వకర్మ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక ఔత్సాహికుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ఆయా పథకాలపై అవగాహన పెంచుకొని ఏప పరిశ్రమలు స్థాపిస్తే వృద్ధిలోకి వస్తామన్న సంపూర్ణ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం జితేంద్ర కుమార్ మిశ్రా, మేనేజర్ అశోక్, డిప్యూటీ రీజియన్ హెడ్ యదుభూషణరెడ్డి, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, ఐపీఓలు రవీంద్రనాథ్‌రెడ్డి, భువనేశ్వరి, నిషాంత్, పారిశ్రామిక ఔత్సాహికులు పాల్గొన్నారు.

అప్పుడూ.. ఇప్పుడూ వాళ్లేనా..?

- డ్వామాలో వైసీపీ మద్దతు అధికారుల హవా
- కీలక పోస్టులన్నింటికి ఇన్‌చార్జిలే దిక్కు
- నాడు ఇష్టారాజ్యంగా బదిలీలు
- చెవిరెడ్డి అనుచరుడు తిరిగి విధుల్లో చేరిక



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో కీలకంగా ఉన్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పట్ల నిర్లక్ష్యం కనిపిస్తోంది. కీలక పోస్టులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వైసీపీ హయాంలో కీలకంగా ఉన్న వారే ప్రస్తుత ప్రభుత్వంలోనూ హవా కొనసాగిస్తున్నారని ఆ శాఖలో చర్చ జరుగుతోంది. ఐదేళ్లుగా పాతుకుపోయి డ్వామాలో కీలకంగా ఉన్న హెచ్‌ఆర్, విజిలెన్స్ విభాగాల్లో ఈ ఆగడాలు అధికంగా ఉన్నాయి. వైసీపీ హయాంలో చేసిన కార్యకలాపాలు నేటికీ కొనసాగుతున్నాయి. పలు క్లస్టర్ల ఏపీడీ పోస్టులతో పాటు పీడీ కార్యాలయంలోని ఏఓ, ఎఫ్ఎం పోస్టులకు సైతం ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. కీలక పోస్టుల్లోనూ ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. డ్వామాలో కీలకమైన ఏఓ పోస్టులో ఉన్న విజయలక్ష్మి గుంతకల్లు డీఎల్‌డీఓగా బదిలీ కావడంతో వాటర్‌షెడ్ అడిషినల్ ఏపీడీ సుధాకర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ మేనేజర్‌గా ఉన్న వెంకటనాయుడు ప్రకాశం జిల్లా డీపీఓగా బదిలీపై వెళ్లడంతో ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న విజిలెన్స్ అధికారి రమణారెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టారు. రాయదుర్గం క్లస్టర్ ఏపీడీగా ఉన్న జయకుమార్ మాతృశాఖ హార్టికల్చర్‌కు వెళ్లడంతో సీబీ ఏపీడీ అయేషాకు ఇన్‌చార్జిగా నియమించారు. ఉరవకొండ ఏపీడీ బదిలీ కావడంతో పీడీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న శైలజకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తాడిపత్రి ఏపీడీ వెంకటరత్నంను అన్నమయ్య జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేయడంతో గుత్తి ఇన్‌చార్జి ఏపీడీగా ఉన్న విజయ్‌కుమార్‌కు ఇక్కడ అదనపు బాధ్యతలు అప్పగించారు.

తిరిగి విధుల్లోకి చెవిరెడ్డి సన్నిహితుడు

వైసీపీ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న గుత్తి ఏపీడీ రాజశేఖర్‌రెడ్డి మూడు రోజుల క్రితం తిరిగి విధుల్లో చేరారు. తిరుపతిలో ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఇక్కడికి వచ్చారు. అసలు విషయంలోకి వెళితే.. డ్వామాలో సీబీ ఏపీడీగా ఉన్న విజయ్‌కుమార్‌ను 2021లో గుత్తి క్లస్టర్ ఏపీడీగా బదిలీ చేశారు. అదే సమయంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సన్నిహితుడు తిరుపతి డీఎల్‌డీఓగా ఉన్న రాజశేఖర్‌రెడ్డిని... గుత్తి రెగ్యులర్ ఏపీడీగా బదిలీ చేశారు. తిరిగి ఆయనను డెప్యూటేషన్‌పై తిరుపతికి పంపారు. రెగ్యులర్ ఏపీడీగా ఉన్న విజయ్‌కుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పుడు రాజశేఖర్‌రెడ్డి ఏపీడీగా విధుల్లోకి చేరడంతో విజయ్‌కుమార్‌ను అక్కడి నుంచి తప్పిస్తూ తాడిపత్రి క్లస్టర్ ఇన్‌చార్జి ఏపీడీగా బాధ్యతలు అప్పగించారు. డ్వామాలో వైసీపీ ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న వారికే పట్టం కడుతూ వచ్చారు. రాజశేఖర్‌రెడ్డిని తిరిగి విధుల్లోకి చేర్చుకోవడంతో వైసీపీ ప్రభుత్వానికి అంటకాగిన వ్యక్తిని ఎలా చేర్చుకుంటారనే విమర్శలు వినవస్తున్నాయి.

వీరికి స్థాన చలనం లేదా..?

వైసీపీ ప్రభుత్వంలో చేరిన అధికారులు ఇప్పటికీ డ్వామాలో రాజ్యమేలుతున్నారు. ఐదేళ్లు పూర్తయినా ఆ ఇద్దరి అధికారులకు మాత్రం స్థానచలనం కలగడం లేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డ్వామాలో హెచ్‌ఆర్, విజిలెన్స్ విభాగాలే కీలకం. గత ఐదేళ్లుగా ఒకే స్థానాన్ని అంటిపెట్టుకున్న ఆ ఇద్దరు చెప్పిందే నడుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా సుమారు ఆరుగురు ఏపీఓలు పీడీ కార్యాలయంలో పనిచేయగా, మరో ఆరు మండలాల్లో ఇద్దరు చొప్పున ఏపీఓలను నియమించారు. ఐదేళ్లుగా పాతుకుపోయిన ఆ ఇద్దరి అధికారులకు స్థానచలనం కల్పించి పారదర్శక పాలన చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఏపీడీలను ఇంకా కేటాయించలేదు



డ్వామాలో కొన్ని పోస్టులు ఖాళీగా ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వం ఇంకా ఏపీడీలను జిల్లాకు కేటాయించలేదు. దీంతో ఉన్న వారితోనే సర్దుకుంటున్నాం. ఉన్న అధికారులకు పలు క్లస్టర్లకు ఇన్‌చార్జిలుగా నియమించాం. ప్రభుత్వం ఏపీడీలను కేటాయిస్తే ఇన్‌చార్జిల స్థానంలో నియమించడానికి వీలవుతుంది. ఈనెలాఖరులోపు అన్ని పోస్టుల్లో అధికారులను నియమించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

- సలీంబాషా, పీడీ, డ్వామా

క్రైం కార్నర్

భవిత ఛిద్రం..!

నాన్న వ్యాయామ ఉపాధ్యాయుడు..
బిడ్డను గొప్ప క్రీడాకారిణిగా
చూడాలనుకున్నాడు..
అందుకు ఎంతో కష్టపడ్డాడు..
కూతురు కూడా మెట్టు మెట్టు ఎక్కుతూ..
విజయపరంపర కొనసాగించింది..
రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటింది..
జాతీయస్థాయికి ఎంపికైంది..
ఇక.. ఇంటికి బయల్దేరింది..
ఆ తండ్రీకుమార్తె ఆనందానికి అవధుల్లేవ్..
రైలులో వచ్చిన బిడ్డను తీసుకుని..
ఆ నాన్న ఇంటికి బయల్దేరాడు..
ఇల్లంతా పండుగ వాతావరణం..
ఇంతలోనే విధి కాటేసింది..
రోడ్డు ప్రమాదం రూపంలో
నాన్న ఆశయాన్ని బలి తీసుకుంది..
నాన్న కన్న కలలను కల్లలు చేసింది..
నాన్న ఆశలు ఛిద్రం చేసింది..

- హాకీ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ
- జాతీయస్థాయికి ఎంపిక
- ఆనందంలో ఇంటికొస్తూ..
- రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి
- తండ్రికి తీవ్రగాయాలు


గాయపడిన గరికల రమేష్


విద్యార్థిని సాయిభవిత (ఫైల్)

పెనుకొండ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికై తిరిగి వస్తున్న విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో మరణించింది. విద్యార్థి తండ్రి తీవ్రంగా గాయపడి, ఆస్పత్రి పాలయ్యాడు. పెనుకొండ మండలం గుట్టూరు వద్ద బుధవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో పదో తరగతి విద్యార్థిని సాయిభవిత (15) మరణించగా.. ఆమె తండ్రి గరికల రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. కియ స్టేషన్ ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలి ఉన్నాయి. రొద్దం ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడి(పీఈటీ)గా పనిచేస్తున్న గరికల రమేష్ పెనుకొండలోని వజ్రాలపేటలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య మల్లిక, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సాయిభవిత పెనుకొండలోని శాంతినికేతన్ పాఠశాలలో పదో తరగతి చదువుతుండేది. హాకీలో ప్రతిభ చాటుతుండేది. ఈనెల 2న నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు వెళ్లింది. అక్కడ సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. పోటీలు ముగించుకుని నెల్లూరు నుంచి రైలులో సొంతూరికి బయల్దేరింది. బుధవారం ధర్మవరం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. తండ్రి గరికల రమేష్ ధర్మవరం నుంచి ద్విచక్రవాహనంలో కుమార్తెను తీసుకుని పెనుకొండకు బయల్దేరారు. గుట్టూరు వద్దకు రాగానే వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుట్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సాయిభవితను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. రమేష్‌ను అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. సాయిభవిత మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని, బోరున విలపించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మంత్రి దిగ్ర్భాంతి

విద్యార్థిని సాయిభవిత మృతిపట్ల బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం బాధాకరమన్నారు. పీఈటీ రమేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మహిళ ఆత్మహత్య


సుబ్బమ్మ (ఫైల్)

పెద్దపప్పూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామంలో సుబ్బమ్మ (55) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన బాలనారాయణ, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో ఒకరు మృతి చెందగా.. మిగతా ఇద్దరు వివాహాలు చేసుకుని వేరు కాపురం పెట్టారు. బాలనారాయణ అనారోగ్యంతో 10 రోజుల క్రితం మృతి చెందాడు. భర్త చికిత్స కోసం సుబ్బమ్మ రూ.లక్ష అప్పు చేసింది. భర్త చనిపోయి, అప్పు మీద పడడంతో తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటికి స్థానికులు గమనించి కుమారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెనుకొండ వైసీపీలో బయటపడ్డ విభేదాలు

- పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి శంకర్‌నారాయణ వర్గం దూరం
- అన్నదమ్ములు దోచేశారు: ఉష వర్గం


సమావేశంలో మాట్లాడుతున్న ఉషశ్రీ

హిందూపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయి, అధికారం కోల్పోయినా జగన్ పార్టీలో విభేదాలు మాత్రం తగ్గలేదు. పెనుకొండ నియోజకవర్గంలో మాజీ మంత్రి శంకర్‌నారాయణ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ మధ్యం విభేదాలు తాజాగా మరోసారి బయటపడ్డాయి. 2019 ఎన్నికల్లో పెనుకొండ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన శంకర్‌నారాయణ మంత్రిగా పనిచేశారు. అప్పట్లో ఆయనను వైసీపీలోని ఓ బలమైన సామాజికవర్గం వ్యతిరేకిస్తూ వచ్చింది. 2024లో టిక్కెట్ ఇస్తే కచ్చితంగా ఓడిస్తామని అధిష్ఠానానికి తెగేసి చెప్పారు. ఈ పరిస్థితుల్లో శంకర్‌నారాయణను అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పంపి, పెనుకొండకు అప్పట్లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న ఉషశ్రీని తీసుకొచ్చారు. ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో అప్పటి నుంచి శంకర్‌నారాయణ, ఉషశ్రీ వర్గాలు విడిపోయాయి. ఉషశ్రీ మంత్రిగా ఉన్నప్పుడు.. శంకర్‌నారాయణ ఇంటికి వెళ్లడానికి ప్రయత్నించగా.. ఆయన కలవని పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సమయంలో వారి మధ్య అగాథం అలాగే కొనసాగింది. ఉషశ్రీ కూడా నియోజకవర్గంలోని శంకర్‌నారాయణ వర్గీయులపై గుర్రుగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగిన ఉషశ్రీ ఘోర పరాజయం పాలైంది. రాష్ట్రంలో వైసీపీ కూడా ఓడిపోయింది. నియోజకవర్గంలో ఉషశ్రీ, శంకర్‌నారాయణ వర్గాల మధ్య విభేదాలు మాత్రం అలాగే ఉన్నాయి. పైపైకి విభేదాల్లేవని ఉషశ్రీ చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో వర్గపోరు మాత్రం అలాగే ఉందనడానికి బుధవారం గోరంట్లలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవమే నిదర్శనం. కార్యక్రమానికి శంకర్‌నారాయణ వర్గం దూరంగా ఉంది.

శంకర్‌నారాయణ వర్గం డుమ్మా

ఎన్నికలకు ముందు గోరంట్లలో శంకర్‌నారాయణ వర్గీయులు పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇందులోనే ఎన్నికలదాకా ఉషశ్రీ కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ఉషశ్రీ వర్గం పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించింది. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ హాజరయ్యారు. ఆమె వర్గీయులు మాత్రమే పాల్గొన్నారు. ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీతో పాటు మెజార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు హాజరు కాలేదు. దీనినిబట్టి అక్కడ వర్గవిభేదాలున్నట్లు స్పష్టమవుతోంది. కార్యక్రమంలో ఉషశ్రీ వర్గానికి చెందిన మండల కన్వీనర్ శంకర్.. శంకర్‌నారాయణ అన్నదమ్ములను విమర్శించారు. వారివల్లే పార్టీ దెబ్బతిందనీ, శంకర్‌నారాయణ వర్గీయులు కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. పక్కనే ఉన్న ఉషశ్రీ వారించకపోవడం గమనార్హం. ఏది ఏమైనా పెనుకొండ వైసీపీలో వర్గపోరు కొనసాగుతుందనడానికి ఇదో నిదర్శనం.

టమోటాకు బీమా

అన్నదాతల ఆనందం

పుట్టపర్తిరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులు ఇటీవలిగా అధికంగా సాగుచేస్తున్న ఉద్యాన పంట టమోటా. ఈ పంట సాగు లాటరీగా మారిందన్న వాదనలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ధర బాగుంటే లాభాలొస్తాయి. ధర పాతాళానికి పడిపోతే రోడ్ల పక్కన దిగుబడిని పడేయాల్సిందే. ఏడాదిలో ఎక్కువ రోజులు పంట దిగుబడిని పడేయాల్సి వస్తోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పులపాలవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా టమోటాకు బీమా వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. ఎకరాకు ఏకంగా రూ.32 వేలు బీమా వర్తింపజేసింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్త చేస్తున్నారు. బీమా ప్రీమియం పది శాతం అంటే రూ.3,200 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రూ.1600 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. మిగిలిన రూ.1600 మాత్రం రైతు వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ప్రకటనలో వెల్లడించారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టమోటాను విస్తారంగా సాగు చేస్తున్నారు. పంట బాగాపండితే రైతన్నలకు ఎకరాకు 15 టన్నుల దాకా దిగుబడి వస్తుంది. రైతన్నలు ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంట చేతికొచ్చే సమయంలో అకాలవర్షాలు, వాతావరణ మార్పులు, దిగుబడి రాకపోవడం తదితర కారణాలతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయి, అప్పుల పాలవుతున్నారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో టమోటాను సాగుచేసే రైతన్నలకు రబీ సీజన్‌కు సంబంధించి రాష్ట్రప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేస్తోంది.

ఇవీ అర్హతలు..

- బ్యాంకులు/ప్యాక్స్ మొదలగు సంస్థలనుంచి అక్టోబరునుంచి డిసెంబరు 15 మధ్య రుణాలు పొందిన రైతులు అర్హులు.
- బ్యాంకులో రుణాలు పొందనివారు సొంతంగా డిసెంబరు 15లోపు కామన్ సర్వీస్ ద్వారాగానీ బ్యాంకుల ద్వారాగానీ నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చు.
- రైతులు బ్యాంకుల ద్వారాగానీ, సొంతంగాగానీ ఇన్సూరెన్సు సౌకర్యం పొంది, తర్వాత అవసరం లేదనుకుంటే డిసెంబరులో ఏడు పనిదినాల్లోపు రద్దు చేసుకోవచ్చు. ప్రీమియం సొమ్ము వాపసు ఇస్తారు. బీమా చేయదలచుకున్న పంటను మార్చుకోవాలంటే డిసెంబరు 15లోపు కనీసం రెండురోజులు ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కొత్తపంటకు కావాల్సిన అధిక ప్రీమియం ఉంటే రైతులు చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ ఐతే ప్రీమియం సాగుచేసిన పంటకు మినహాయించి మిగిలిన సొమ్మును రైతులకు తిరిగి చెల్లిస్తారు.


ప్రసాదాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు

వెంకటేశ్వరుడికి సేవ.. అదృష్టం

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు
- టీటీడీ బోర్డు సభ్యుడిగా ప్రమాణం


ఎంఎస్ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మడకశిరటౌన్/అనంతపురం అర్బన్/బుక్కరాయసముద్రం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్షదైవం ఏడుకొండల వెంకటేశ్వరస్వామికి సేవ చేసుకునే అవకాశం దక్కడ అదృష్టమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమితుడైన ఆయన బుధవారం తిరుమలలో ప్రమాణం చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు శాలువాతో సత్కరించారు. స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన తప్పిదాలను సరిదిద్దుతామన్నారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రుణపడి ఉంటానన్నారు. ఆయనకు హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, **టీడీపీ రాష్ట్ర నాయకులు రాయల్ మురళి, రామలింగారెడ్డి, రాంప్రసాద్, అనిల్ కుమార్ చౌదరి, వెంకటప్ప, రామానాయుడు, లక్ష్మీనారాయణ శాలువ కప్పి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.**

పరిగి ఏఎస్ఐ సస్పెన్షన్

హిందూపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పరిగి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ హిదయతుల్లాను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ రత్న బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హిదాయతుల్లా గతంలో హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే సమయంలో ఓ కేసులో నిందుతులు పట్టుబడ్డారు. వారికి కాపలాగా ఏఎస్ఐ ఉన్నాడు. అప్పట్లో వారు తప్పించుకుని పోయారు. అప్పట్లో ఈ విషయంపై విచారణ చేసి, నివేదికను గోప్యంగా ఉంచారు. అప్పట్లో తప్పించుకున్న నిందుతులు చిలమత్తూరు మండలంలో సామూహిక అత్యాచార కేసులో నిందితులు. ఇటీవల అత్యాచార కేసు నిందితులను ఉన్నతాధికారులు విచారించిన సమయంలో పోలీసుల పాత్రపై కూపీలాగారు. అప్పట్లో ఏఎస్ఐ హిదాయతుల్లా విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటం కారణంగానే నిందితులు తప్పించుకున్నారని ఉన్నతాధికారులు గుర్తించారు. అప్పట్లో నిందుతులు తప్పించుకోవడానికి ఏఎస్ఐ సహకరించారా, నిర్లక్ష్యంగా వ్యవహరించారా, ప్రత్యక్షంగా, పరోక్షంగా వారితో చేతులు కలిపారా అన్న విషయాలు ఉన్నతాధికారులు వెల్లడించలేదు. పక్కా ఆధారాలతో పాత నేరస్తులు చెప్పిన వివరాలతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. గ్యాంగ్‌రేప్ కేసులో పట్టుబడిన పాతనేరస్తులను విచారించిన సందర్భంలో తెలిపిన సమాచారంతో ఇప్పటికే హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన విషయం విదితమే. బుధవారం ఏఎస్ఐను సస్పెండ్ చేయడం సంచలనంగా మారింది. ఇంకా ఎంతమందిపై వేటు పడుతుందోనన్న టెన్షన్ పోలీసు శాఖను వెంటాడుతోంది.

జాతీయ సమైక్యతా శిబిరానికి అనంత విద్యార్థులు



విద్యార్థులతో ఇన్‌చార్జ్ వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతా శిబిరానికి ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికైనట్లు కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. బుధవారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వీసీ అనిత మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాష్ట్ర ఖ్యాతిని చాటుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 8నుంచి 14వరకు గుజరాత్‌లో నిర్వహించే జాతీయ సమైక్యతా శిబిరానికి ఎస్కేయూ నుంచి ఎంపికవడం హర్షణీయమని కొనియాడారు. బాలికల విభాగం నుంచి అమృత (ఆర్ట్స్ కళాశాల), రాఘవి(కేఎస్ఎన్), నవ్యశ్రీ(ఎస్కేయూ ఫార్మసీ), లోహిత(ఎస్వీ కళాశాల), సాయిహర్షిత (ఎస్‌పీఆర్ కాలేజ్, హిందూపురం) ఎంపియ్యారన్నారు. బాలుర విభాగం నుంచి అబ్దుల్ రెహమాన్ (రాయదుర్గం), మంజునాథ్ (హిందూపురం), పవన్(ఎస్‌కేపీ గుంతకల్లు), రఘువర్ధన్ (ఎస్ఐటీఆర్ మడకశిర), ధనుష్ (కేహెచ్ కాలేజ్, ధర్మవరం) ఎంపికైనట్లు తెలిపారు. అక్కడ నిర్వహించే పోటీల్లో ప్రతిభను కబర్చి రాష్ట్రానికి, ఎస్కేయూకి మరోసారి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపట్నుంచి గ్రామసభలు

నల్లమాడ , నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 8 నుంచి 27 వరకు ప్రజాఫిర్యాదుల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రంగనాయకులు బుధవారం తెలిపారు. 8న చారుపల్లి సచివాలయం, 12న వేళ్లమద్ది, ఎర్రవంకపల్లికి సంబంధించి వేళ్లమద్దిలో, 13న వంకరకుంట, 14న రెడ్డిపల్లి, 15 పాతబత్తలపల్లి, 19న నల్లమాడ 1, 2, 3, 20న గోపేపల్లి, 21న కురమాల, 26న పుల్లగంపల్లి, 27న దొన్నికోటలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

తనకల్లు మండలంలో..

తనకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో ప్రజాఫిర్యాదుల పరిష్కార సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శోభాసువర్ణమ్మ బుధవారం తెలిపారు. ఈనెల 10న ఉలవాండ్లపల్లి, 11న చిన్నరామన్నగారిపల్లి, 12న దిగువమండ్లిపల్లి, మద్దినాయునిపాళ్యం, 13న తనకల్లు, కొర్తికోట, 14న కొక్కంటి, 15న అగ్రహారంపల్లి, 19న టి.సదుం, 20న బాలసముద్రం, 21న చీకటిమానుపల్లి, 22న బొంతపల్లి, 26న మల్లిరెడ్డిపల్లి, 27న గుర్రంబైలు, 28న కోటపల్లి, 29న దండువారిపల్లి, డిసెంబరు 3న ముండ్లవారిపల్లి, 4న వెంకటరాయునిపల్లి, 5న తవళం, 6న ఈతోడు గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

ఓబుళదేవరచెరువు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని తహసీల్దార్ అనంతాచారికి సీపీఐ నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. ఆ పార్టీ నియోజకవర్గకార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. నిత్యం ఆధార్‌లో వివిధ రకాల మార్పులు చేర్పుల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానికంగా ఆధార్ కేంద్రం లేకపోవడంతో కదిరికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చలపతినాయుడు, సహాయ కార్యదర్శి సుధాకర్, గంగులప్ప, చంద్ర పాల్గొన్నారు.

పట్నం ఎస్ఐగా రాజశేఖర్



ముదిగుబ్బ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పట్నం ఎస్ఐగా రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్ఐ నరసింహులు తలుపులకు బదిలీపై వెళ్లారు. రొళ్ల నుంచి రాజశేఖర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

రబీ టమోటాకు బీమా

కదిరి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగుచేసిన టమోటా పంటకు వాతావరణ ఆధారిత పంట బీమా వర్తిస్తుందని ఉద్యానశాఖాధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో సాగు చేసిన టమోటా పంటను ఏట శ్రీనివాసులుతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడారు. రబీ సీజన్‌లో అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు నాటే టమోటాకు వాతావరణ పరిస్థితుల కారణంగా నష్టం వాటిల్లితే రైతులకు ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా వర్తింపజేయనుందన్నారు. రైతులు ఆ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎకరాకు రూ.1600 ప్రీమియం చెల్లిస్తే రూ.32 వేలు పంటనష్ట బీమాను పొందవచ్చన్నారు.

కమిటీల ఏర్పాటు

తనకల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టడానికి గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని మల్లిరెడ్డిపల్లి, గేమేనాయక్ తండా గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేశారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో 11 మందితో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కమిటీలు గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా వాటిని చట్టపరంగా అడ్డుకుంటాయన్నారు.

పార్టీ కార్యాలయం ..

నల్లమాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ కూడలిలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ గంగాధర్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి ఆరు సంవత్సరాలు అవుతోందని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందని అన్నారు. మన రాజధాని అమరావతి నిర్మించడంతో అభివృద్ధి అంతా అక్కడే జరుగుతోందని, రాయలసీమకు అన్యాయం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నేతలు రామచంద్ర, నల్లమాడ, ఓడీసీ కార్యదర్శులు చంద్ర, శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ వెలుగు కో-ఆర్డినేటర్‌గా రవీంద్ర

ఓబుళదేవరచెరువు: డీఆర్‌డీఏ-వెలుగు ఓబుళదేవరచెరువు క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్‌గా రవీంద్రను నియమిస్తూ పీడీ నరసయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఓడీసీ ఏపీఎంగా పనిచేస్తున్న రవీంద్రాకు, అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇతను ఓడీసీ, అమడగూరు, నల్లమాడ, తనకల్లు, నల్లచెరువు మండలాలకు ఏరియా కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తారు.

రైతులకు అవగాహన

తనకల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంటకు వస్తున్న చీడపీడలను మొబైల్ యాప్ క్యాబి ద్వారా గుర్తించే విధానంపై వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని మార్పురివాండ్లపల్లిలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో క్యాబి టూల్స్ ఉపయోగించే విధానాన్ని రైతులకు వివరించారు. సెల్‌ఫోన్లలో క్యాబి యాప్‌ను డౌన్‌లోడ్ చేసి రైతులు స్వయంగా పంటలకు వస్తున్న చీడపీడలను ఎలా గుర్తించాలో ప్రయోగాత్మకంగా చూపించారు. పంటకు పట్టిన చీడలు, తెగుళ్లను ఈ యాప్ ద్వారా ఫోటో తీస్తే.. వాటిని నివారణకు వాడాల్సిన మందులను తెలుగులోనే సమాచారం వస్తుందన్నారు. కార్యక్రమంలో మార్పురివాండ్లపల్లి, రాగినేపల్లి గ్రామాల రైతులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది చిన్నక్రిష్ణ, జనజాగృతి సిబ్బంది ధరణీ, గరుడప్ప, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తోనే రాణింపు

పుట్టపర్తిరూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కార్పొరేట్.. పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్, శ్రవణ నైపుణ్యాలతోనే రాణింపు సాధ్యమని బెంగుళూరు టీసీఎస్ సైబర్ సెక్యూరిటీ గ్రూప్ వర్కర్స్ మేనేజర్ శ్రీనివాస రామానుజం పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్ర పరిధిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన అనుబంధన్-2024 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో రాణించిన మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సెంథిల్ కుమార్, డీన్ బాలకోటేశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు తూట్లు...

అక్రమ లే అవుట్లు

- విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న రియల్టర్లు
- తహసీల్దార్ కార్యాలయ సమీపంలో సైతం..
- పట్టించుకోని అధికారులు



బైపాస్ సమీపంలోని అక్రమ లేఅవుట్

బత్తలపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి... నాలుగు ప్రధాన రోడ్లు కూడలి ఉండటం... అందుబాటులో ఆర్డీటీ ఆస్పత్రి ... కొత్తగా బైపాసు రోడ్డు ఏర్పాటు.. వీటితో మండల కేంద్రంలో భూములకు డిమాండ్ పెరిగింది. వైసీపీ సానుభూమిపరులైన రియల్టర్లు విచ్చలవిడిగా అక్రమ లే అవుట్లకు తెరతీశారు. ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా.. నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా.. అక్రమంగా లే అవుట్లు ఏర్పాటు చేసి.. వాటిని విక్రయించి.. రూ.కోట్లు గడిస్తున్నారు. ఇంతజరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఏకంగా తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఆర్‌అండ్‌బీ స్థలాన్ని సైతం నకిలి రిజిస్ట్రేషన్ చేయించి విక్రయించారంటే.. మన అధికారులు ఎంత అప్రమత్తంగా ఉన్నారో ఇట్టే అర్థం అవుతుంది. వీరి నిర్లక్ష్యం రియల్టర్ల పాలిట వరంగా మారింది. మరిన్ని అక్రమ లేఔట్లు వేసి.. అధిక ధరలకు ఇష్టానుసారంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు అనుమతి తప్పనిసరి. అంతేకాకుండా లేఅవుట్‌లో భూమి, పార్కులు, ప్రభుత్వ



జాతీయ రహదారి పక్కన అక్రమ లేఅవుట్

పాఠశాలలు, దేవాలయాలకు తప్పనిసరిగా స్థలం కేటాయించాలి. కానీ రియల్టర్లు ఈ నిబంధనలను ఏ మాత్రం పాటించకుండా.. దందా నడుపుతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు వ్యవసాయ భూమిని వ్యవసాయ యేతర భూమిగా మార్చుకోకుండా వందల ఎకరాలలో అక్రమ లే అవుట్లు వేశారు. అనుమతులు తీసుకోకుండా సెంటుకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. కదిరి రోడ్డులోని జాతీయ రహదారి పక్కన సర్వే నెంబరు 103లో మూడెకరాల్లో అక్రమ లేఔట్లు వేసేందుకు పనులు ప్రారంభించారు. వర్షపు నీరు వెళ్లే కల్వర్టుకు అడ్డంగా మట్టి తోలి.. లే అవుట్ వేశారు. వర్షాలు వచ్చినప్పుడు నీరు ఎక్కడికి వెళ్తుందని చుట్టుపక్కల రైతులు వాపోతున్నారు. బైపాసు రోడ్డు సమీపంలో చింతలపల్లికి వెళ్లే రస్తా వద్ద సర్వేనెంబరు 277లో 4.05 ఎకరాలలో అక్రమ లే అవుట్లు వేశారు. తహసీల్దార్ కార్యాలయ సమీపం లో ఏకంగా ఆర్‌అండ్‌బీ స్థలాలనే విక్రయించినా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

ట్రాక్టర్ ఇసుక రూ.3,500: ఎమ్మెల్యే



కదిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రీచ్‌ల నుంచి కదిరికి ట్రాక్టర్ ఇసుకను సరఫరా చేసేందుకు రూ.3,500 మాత్రమే చెల్లించాలని, అంతకన్న ఎక్కువ ఎవరైనా వసూలు చేస్తే నేరుగా రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన నివాసంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తోందని, ఉప్పలపాడు, గండి రీచ్‌ల నుంచి కదిరికి రావడానికి రవాణా చార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఇసుక స్థానిక నదులు, వంకల నుంచి తీసుకొచ్చుకునేవారు ట్రాక్టర్లకు బాడుగ మాత్రమే చెల్లించాలని సూచించారు. ఎవరూ ఇసుకను అధిక ధరకు అమ్మినా, అధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు.

● భూదందాలు ఉపేక్షించం: అక్రమ పట్టాలు, భూదందాలు, చేసేవారిని ఉపేక్షించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. సున్నంపు గుట్టతండా పట్టాల్లో అక్రమార్కులు అధికంగా ఉన్నారని, వాటిపై సమగ్రంగా విచారణ చేయిస్తామని అన్నారు. తాము కక్షలతో వీటికి పాల్పడటం లేదని, అక్రమాలు చేసినవారిని బయటపెడుతున్నామని చెప్పారు. తమది సంక్షేమ, అభివృద్ధి ప్రభుత్వమన్నారు. అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. వచ్చే రెండేళ్లలో నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. రోడ్లు, ఉపాధి, తాగు, సాగునీరు కనీస సౌకర్యాలు అందిస్తామన్నారు.

చెరువుల గురించి పట్టించుకోరా..!

గ్రామసభలో అధికారులను నిలదీసిన రైతులు

తాడిమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'పడమటి చెరువు ఆక్రమణకు గురవుతోందని మూడు నెలల క్రితం ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు.. ఇప్పుడేమో నీటి సంరక్షణ పనులు గుర్తిస్తామని గ్రామసభలు పెడతారా.. !.. చెరువులే లేకపోతే ఇక మీరు నీటిని ఎలా రక్షిస్తారు..' అంటూ రైతులు అధికారులను నిలదీశారు. తాడిమర్రిని కరువు మండలంగా ప్రకటించడంతో ప్రభుత్వం బుధవారం అన్ని గ్రామపంచాయతీల్లో నీటిసంరక్షణ పనుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహించింది. తాడిమర్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులను రైతులు నిలదీశారు. పడమటి చెరువులో అనధికారికంగా బోర్లు వేయడంతో పాటు అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌లు వేసుకుని మోటార్లు ఆడిస్తున్నారని, దీని వల్ల చెరువు దిగువ బాగువ పొలాలకు నీరు లేకుండా పోతోందని రైతులు మండిపడ్డారు. కొందరు రైతులు చెరువును ఆక్రమించుకున్నారని, ఈ విషయం అధికారుల దృష్టికి తెచ్చి మూడు నెలలవుతున్నా ఏ ఒక్కరూ స్పందించిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. ఇప్పుడేమో నీటి సంరక్షణ పనులు గుర్తిస్తామంటూ గ్రామసభలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. చెరువుల ఆక్రమణలను అడ్డుకోకుండా... నీటిని ఎలా రక్షిస్తారంటూ రైతులు శంకర్, వెంకటరాముడు అధికారులను నిలదీశారు. దీనిపై స్పందించిన ఏపీడీ మాట్లాడుతూ... రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్ అధికారులు వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ విజయశేఖర్‌నాయుడు, ఏపీఓ సంజీవరెడ్డి, కార్యదర్శి రిజ్వాన పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న వన్‌టౌన్ సీఐ

ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవ, ఆయన సోదరుడు సందా రవీంద్ర సహాయ సహకారాలతో పట్టణంలో బుధవారం నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య హాజరయ్యారు. మొత్తం రెండు మ్యాచ్‌లు నిర్వహించగా... మొదట ప్రెస్, పోలీసుల జట్లు తలబడ్డాయి. బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు 155 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రెస్ జట్టు 94 పరుగులకే ఆల్ ఔట్ అయింది. పోలీసు జట్టు తరపున వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ 65 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నారు. మధ్యాహ్నం మున్సిపల్ సిబ్బంది, సంధారాఘవ జట్టు మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన మున్సిపల్ టీం 99 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్ దిగిన సంధారాఘవ టీం 100 పరుగులు సాధించి విజయం సాధించింది. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, జింకా పురుషోత్తం, చందు, పూజారి, జనార్దన్, విశ్వనాథ్, క్రికెట్ కార్యనిర్వాహకులు భరత్, అన్నం సాయినాథ్, ఫయాజ్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గాయాలు

ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌కు చెందిన వృద్ధురాలు లక్ష్మమ్మ బుధవారం విద్యుత్‌షాక్‌తో తీవ్రంగా గాయపడింది. ఆమె ఆకుకూరల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. రంగా సినీకాంప్లెక్స్ సమీపంలో డీపీ వద్ద ఉండగా.. విద్యుత్ షాక్ తగిలింది. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్టు

కదిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తలుపుల శివార్లలో కోడిపందెం ఆడుతున్న 20 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారినుంచి రూ.60,200 నగదు, 20 ద్విచక్రవాహనాలు, 20 సెల్‌ఫోన్లు, ఎనిమిది కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

చింతలపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు

ధర్మవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు ప్రతిఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, నాయకులు విజయసారధి, పురుషోత్తమనాయుడు, శంకరనాయుడు, అశ్వత్థనాయుడు, నరేంద్రచౌదరి, వెంకటరమణ, నారా తిప్పానాయుడు, వెంకట్రాముడు, పెద్ద చక్రయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న టీడీపీ నాయకులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విక్కీ



ధర్మవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు స్థానిక జీవన్‌జ్యోతి పాఠశాల విద్యార్థి ఎస్.విక్కీ ఎంపికయ్యాడు. గత నెల 23న అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ హాకీ పోటీల్లో ప్రతిభ కనబరచి.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 8 నుంచి అనకాపల్లి జిల్లా సక్కలపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరపున పాల్గొంటారని ఆ పాఠశాల హెడ్‌మిస్ సుజాత తెలిపారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్డీఓ కార్యాలయ డీఏఓ ఖతిజన్ కుబ్రా సూచించారు. ఆర్డీఓ కార్యాలయ సమావేశపు భవనంలో మండల సర్వేయర్లు, రీ సర్వేపూర్తి అయిన గ్రామ సర్వేయర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్‌లైన్స్, పట్టా సబ్‌డివిజన్స్, ప్రజాసమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలు సర్వీస్ లెవెల్ అగ్రిమెంట్‌లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

పుట్టపర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. ఇంజనీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, కళాశాల విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ హామీ ఇచ్చారని.. నేడు విద్యాశాఖ మంత్రిగా ఆ హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని అన్నారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలన్నారు. ఈ నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, నాయకులు హరీశ్‌కుమార్, బాబావలి, పవన్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించండి

ముదిగుబ్బ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి.. ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శి మంజులకు కూటమి నాయకులు కోరారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన గ్రామసభలో వినతి పత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో ఉపాధి కూలీలకు పనుల్లేక.. వలసలు వెళ్తున్నారని, తక్షణం ఫీల్డ్ అసిస్టెంట్ నియమించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గాండ్లపెంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా అవినీతి నిర్మూలన-సమాజ బాధ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సిఫాఖానం మొదటి, శ్రావన్ రెండో, సాయి తేజ మూడో బహుమతి పొందారు. ఎస్ఏజీ బ్యాంక్ మేనేజర్ భరత్ ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ శ్రావన్ వారికి బహుమతులు అందజేశారు.

వేరుశనగ వామి దగ్ధం

టీడీపీ నాయకుల ఆర్థికసాయం



నారాయణకు నగదు అందచేస్తున్న కన్వీనర్ సోమశేఖర్

గోరంట్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూగానిపల్లికి చెందిన రైతు చాకలి నారాయణప్పకు టీడీపీ నాయకులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. నారాయణప్ప పొలంలో వేరుశనగకాయల వామికి సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆయనకు రూ.75వేల నష్టం జరగడంతో టీడీపీ కన్వీనర్ సోముశేఖర్ ఆధ్వర్యంలో చందాలు వేసుకుని బాధిత రైతుకు రూ.25వేల నగదు అందించారు.

యథేచ్ఛగా మట్కా

లేపాక్షి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మట్కా లేపాక్షిలో యథేచ్ఛగా కొనసాగుతోంది. బహిరంగ ప్రదేశాల్లో చిల్లర దుకాణాల్లోనూ ఏజెంట్లు ఆన్‌లైన్ ద్వారా యథేచ్ఛగా మట్కా నిర్వహిస్తున్నారు. పక్కరాష్ట్రమైన కర్ణాటక నగరిగెరకు ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరుపుతున్నారు. మట్కా విషయం పోలీసులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇటీవల పోలీస్ సిబ్బంది మట్కా నిర్వాహకుడిని స్టేషన్‌కు తీసుకెళ్లి అతనివద్ద ఉన్న సెల్‌ఫోన్, నగదు స్వాధీనం చేసుకుని వదిలేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పటినుంచి రోజూ యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న కట్టుబడి అంజి, నాయకులు

గోరంట్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రానికి చెందిన కుమ్మర గురుమూర్తి (68) మృతిచెందడంతో పార్టీనాయకులు బుధవారం ఆయన కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అంద జేశారు. మృతి చెందిన గురుమూర్తి పార్టీ సభ్యుడు కావడంతో మంత్రి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబానికి రూ.పదివేల నగదును అందించి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కట్టుబడి అంజి, సుబహాన్, ఆదినారాయణ, నూకల ప్రసాద్, శివారెడ్డి, రాథ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

గోరంట్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిచెరువుకట్ట ప్రాథమిక పాఠశాల స్థలాన్ని ఫకృద్దీన్ ఆక్రమించుకుని కంచె వేశారని గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకుడు గొల్ల క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయానికెళ్లి ఆర్ఐ సోముశేఖర్‌రెడ్డికి ఈ మేరకు వినతిపత్రం అందించారు. పాఠశాల సమీపంలో ఉంటున్న ఫకృద్దీన్ తన అనుభవంలో ఉన్న స్థలమంటూ పాఠశాల వద్దగల స్థలానికి కంచె వేయడంతో భవనం లోపలికెళ్లే అవకాశంలేకుండా పోయిందని, వెంటనే అధికారులు స్పందించి పాఠశాల స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆదినారాయణప్ప, వడ్డి నగేష్, రవి, శ్రీనివాసులు, నయాజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

పరిగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ హసీనాసుల్తానా ఆదేశాల మేరకు ఊటకూరు, శిరేకోళం, యర్రగుంట, పైడేటి, శాసనకోట, శ్రీరంగరాజులపల్లి, పరిగి 1, 2, మోదా, కొడిగెనహళ్లి, బీచిగానిపల్లి గ్రామాలలో ఈనెల 8నుంచి 27వరకు గ్రామసభలు నిర్వహిస్తామని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలని తహసీల్దార్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

న్యాయవాదుల ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న లాయర్లు

పావగడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విధులు నిర్వహిస్తున్న లాయర్ రవికుమార్‌పై తుమకూరు రూరల్ సీఐ దినేష్‌కుమార్ చేసిన దౌర్జన్యాన్ని ఖండిస్తూ పావగడ న్యాయవాదుల సంఘం బుధవారం బైక్‌ర్యాలీ చేపట్టింది. ఒక భూ వివాదంపై చర్చలు జరుగుతున్న సమయంలో సీఐ దినేష్‌కుమార్, లాయర్ రవికుమార్‌పై దాడి చేసి దుర్భాషలాడారని, న్యాయవాదులకే రక్షణ లేకుంటే సామాన్యులకు న్యాయం ఎలా జరుగుతుందని వారు ప్రశ్నించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దౌర్జన్యానికి పాల్పడిన సీఐను సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా లాయర్లు జయసింహ, శ్యామణ్ణ, రవి, అంబరీష్, వెంకటస్వామి ఈర్యాలీలో పాల్గొన్నారు.

ప్రతి పరిశ్రమలో సీసీ కెమెరాలు ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

హిందూపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడలోని ప్రతి పరిశ్రమ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ మహేష్, సీఐ అంజనేయులు ఆదేశించారు. పరిశ్రమల యజమానులు, హెచ్‌ఆర్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. పరిశ్రమ లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు. మహిళా కార్మికుల భద్రతపట్ల జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ప్రతినెలా యజమానులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, సమస్యలుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రేషన్ పంపిణీ అస్తవ్యస్తం

ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



షాపు వద్ద పడికాపులు కాస్తున్న లబ్ధిదారులు

మడకశిర రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎఫ్‌పీ షాపులులో రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా జరుగుతోంది. దీంతో కార్డుల లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 25,606 రేషన్ కార్డులు ఉండగా.. 60 ఎఫ్‌పీ షాపులు ఉన్నాయి. వాటికి ప్రతినెలా 3,994 క్వింటాళ్ల బియ్యాన్ని 16 ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారులకు ప్రతినెలా 1 నుంచి 15లోపు పంపిణీ చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే వైసీపీ డీలర్లను తొలగించి వారి స్థానంలో కొత్త డీలర్లను నియమించారు. ఎండీయూ ఆపరేటర్లు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నారు. పేరుకే డీలర్లు సరుకులు పంపిణీ చేస్తున్నారని చెప్పినప్పటికీ, మొత్తం ఎండీయూ ఆపరేటర్ల ఆధీనంలోనే జరుగుతోంది. ఎఫ్‌పీ షాపులలో ఆపరేటర్లు బయోమెట్రిక్ వేస్తేనే సరుకులు పంపిణీ జరుగుతోంది. లేదంటే ఆ షాపులో సరుకుల పంపిణీ నిలిచిపోతుంది. దీంతో 16 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ఒకేసారి అన్నీ షాపుల్లో సరుకులు పంపిణీచేయడానికి వీలులేకుండాపోయింది. ఆపరేటర్లు బయోమెట్రిక్ వేసిన షాపులో మాత్రమే సరుకుల పంపిణీ జరుగుతుంది.

దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డీలర్లు కళ్లఎదుటే ఉన్నా ఎండీయూ ఆపరేటర్లు లేకపోతే సరుకులు పంపిణీచేయలేని పరిస్థితి ఏర్పడింది. ఒకషాపులో బియ్యం పంపిణీ చేస్తే మిగిలిన వారు కూడా ఆ షాపునకే రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. షాపుల వద్దకు వచ్చేవారు సంచులను క్యూలో పెట్టి వెళ్తున్నారు. వారి వంతు రాగానే వచ్చి బియ్యం తీసుకెళుతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డీలర్లు గోదాము నుంచి సరుకులు తీసుకెళ్ళి పంపిణీచేసేవారు. ప్రస్తుతం అవిధంగా జరుగడంలేదు. దీంతో కార్డు లబ్ధిదారులు బియ్యం కోసం అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి డీలర్లే నేరుగా సరుకులు పంపిణీచేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని డీలర్లు, ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై డీప్యూటీ తహసీల్దార్ నరసింహమూర్తి మాట్లాడుతూ, ఎఫ్‌పీ షాపుల్లో త్వరగా సరుకులు పంపిణీచేసేందుకు తగుచర్యలు తీసుకోంటామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు.



ఎఫ్‌పీ షాపు వద్ద సంచులను క్యూలో ఉంచిన లబ్ధిదారులు

ఎఫ్‌పీ షాపు నిర్వహణ డీలర్ లాగిన్‌లోనే ఉండాలి..

ఎఫ్‌పీ షాపుల నిర్వహణ డీలర్ల లాగిన్‌తో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎండీయూ ఆపరేటర్ల లాగిన్‌లో ఉండడంతో సకాలంలో సరుకులు లబ్ధిదారులకు పంపిణీ చేయలేక పోతున్నాం. ఒక ఆపరేటర్ పరిధిలో మూడు నుంచి నాలుగు షాపులు ఉండడంతో ఒక షాపులో అతను బయోమెట్రిక్ వేస్తే ఆరోజు మిగిలిన షాపులు పనిచేయడంలేదు. సరుకులు ఉన్నా డీలరు సరుకులు పంపిణీచేయలేని పరిస్థితి నెలకొంది. ఎఫ్‌పీ షాపు డీలర్లకై లాగిన్ కేటాయించాలని కోరుతున్నాం.



రామాంజనేయులు, డీలర్, కేతేపల్లి

అగళిలో కనీస సౌకర్యాలు నిల్

అగళి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అగళి గ్రామ పంచాయతీకి సంబంధించి రామాపురం ఎంఎం పాళెం గ్రామాలలో జనాభా 4500 దాటినప్పటికీ ఈ మండల కేంద్రం కనీస సౌకర్యాలకు కూడా నోచుకోలేదు. మండలం ఏర్పడి 40ఏళ్లు గడిచినా నేటికీ బస్టాండు లేదు, బస్సు రాకపోకలకు తీవ్ర అంతరాయం, మరుగుదొడ్లు లేవు, షెల్టర్ కూడా లేదు. డ్రైనేజీలు నిర్మించలేదు, చెత్త వేయడానికి కూడా ఖాళీ స్థలం లేదు. వచ్చిపోయే మహిళలు బస్టాండులో బహిర్భూమికి వెళ్లాలన్నా పూర్తీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అగళి మండలం నుంచి కర్ణాటక ప్రాంతాలైన శిర, మధుగిరి, తుంకూరు, బెంగళూరు ప్రాంతాలకు జీవనోపాధి కోసం వలస వెళ్లారు. అందులో వ్యాపార లావాదేవీలు అధికంగా కొనసాగుతాయి. ఇక్కడ నుంచి పూల తోటలు, ఒక్క తోటలు, కొబ్బరి, ఆకుతోటలు ఈ ప్రాంతంలో అధికంగా పండుతాయి. పండిన పంటలు కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తుంటారు. కనీసం బస్సు సౌకర్యం కూడా నోచుకోలేదు. పట్టించుకోమని మండలం ఏర్పడినప్పటి నుంచి అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులను విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని అగళి



బురదమయంగా రామాపురం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ రోడ్డు

ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు సెల్‌ఫోన్ నెట్‌వర్క్ దొరకడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఏది ఏమైనా అగళి మండలం అయినప్పటికీ కనీస సౌకర్యాలు నోచుకోలేదని ఇటు ప్రజలు, అటు ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అగళి మండల కేంద్రానికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బస్టాండులో మరుగుదొడ్లు నిర్మించాలి

నేను కర్నాటక నుంచి అగళికి వచ్చాను. అగళి మండల కేంద్రంలోని బస్టాండులో మరుగుదొడ్డి లేక తీవ్ర ఇబ్బందులు పడ్డా. కనీసం బహిర్భూమికి వెళ్లాలన్నా కష్టంగా ఉంది. అగళి బస్టాండులో కనీసం నిలబడటానికి చోటుకూడా లేదు. బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి.



లక్ష్మమ్మ

నాలుగు కిలోమీటర్లు నడవాలంటే కష్టమే

అగళి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అగళి మండలం ఇరిగేపల్లి మండే మారెమ్మ దేవాలయం నుండి గాయిత్రి కాలనీ వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు కంకర తేలింది. ప్రయాణం చేయాలన్నా నరకయాతనంగా తయారైందని గాయిత్రి కాలనీవాసులు, హెచ్‌డిహళ్లి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగైదు నెలలుగా ఇదే పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.



అధ్వాన్నంగా ఇరిగేపల్లి రోడ్డు

ట్రాన్స్‌కో ఏఈగా జయవర్ధనరెడ్డి

చిలమత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల ట్రాన్స్‌కో ఏఈగా జయవర్ధనరెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన గోరంట్ల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండల ఏఈ పోస్టు గత ఏడాది కాలంగా ఖాళీగానే ఉంది. దాంతో కొంత కాలంగా హిందూపురం డివిజన్ డీఈ ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్నారు. ఎట్టకేలకు కొత్త ఏఈ రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఆయనకు విద్యుత్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

సాగులో మెలకువలు పాటించాలి

చిలమత్తూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సాగుచేసే పంటలో మెలకువలు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని పుట్టపర్తి వ్యవసాయ డాట్ సెంటర్ వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం టేకులోడు గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన హాజరై రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. మొక్కజొన్న, వేరుశనగ, కంది పంటల సాగులో మెలకువలను తెలియజేశారు. పంట మార్పిడి చేయడం వలన చీడపురుగులను నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జీవామృతం తయారీ, దాని ఉపయోగాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది అశ్విని, రైతులు పాల్గొన్నారు.

బాలికలను విద్యావంతులను చేద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ

చిలమత్తూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాలికలను విద్యావంతులుగా చేసి సమాజంలో లింగవివక్షతను నిర్మూలిద్దామని ఐసీడీఎస్ సూపర్ వైజర్ లలితమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మెర్జ్‌డ్ అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీపసన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగవివక్షను నిర్మూలించాలన్నారు. బాలికలను చులకనగా చూడరాదన్నారు. ఆడపిల్లలను విద్యావంతులుగా చేయాలన్నారు. వారిపట్ల చిన్న చూపు చూడకుండా బాల్యవివాహాలు అరికట్టాలన్నారు. వారికి అవసరమైన పోషకాహారం అందించి వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఇంట్లో చిన్నారులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు శారద, పార్వతమ్మ, సాహేరాభాను, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై కమిటీ ఏర్పాటు చేయాలి

అగళి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనపై కమిటీలు ఏర్పాటు చేయాలని సత్యసాయిజిల్లా ఐసీడీఎస్ అధికారి నాగలక్ష్మీ పేర్కొన్నారు. అగళి మండలం కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామ సచివాలయాల్లో కూడా కమిటీలు ఏర్పాటు చేసి బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సచివాలయ కమిటీలకు గ్రామ సర్పంచ్, ఛైర్‌పర్సన్‌గా మహిళా పోలీస్, కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ పాఠశాల హెచ్‌ఎం, మహిళా సంఘ సభ్యులు, ఏఎన్‌ఎం, ఎన్జీఓ, అంగన్వాడీలు, మెంబర్లుగా కొనసాగుతారు. ఈ సందర్భంగా జూనియర్ అసిస్టెంట్ అమృతవల్లి, సూపర్‌వైజర్ లీలావతి, తదితరులు ఉన్నారు.

పార్టీ సభ్యత్వ నమోదును పూర్తి చేయాలి

చిలమత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త విధిగా వంద శాతం పూర్తీ చేయాలని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర సూచించారు. బుధవారం మండలంలోని కోడూరు పంచాయతీ మొరంపల్లిలో కన్వీనర్ రంగారెడ్డితో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసే దిశగా ఎక్కువ మంది సభ్యత్వం తీసుకునేలా చూడాలన్నారు. ప్రధానంగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాహిత కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేమకేతేపల్లి అంజినప్ప, శ్రీదేవి, బేకరీ గంగాధర్, శ్రీనివాసరెడ్డి, నందీషప్ప, గంగాధరప్ప, వేణుగోపాల్ తదితరలు ఉన్నారు.

ఆక్రమణదారులు నాటిన రాళ్ల తొలగింపు

హిందూపురం అర్బన్, నవంబరు 6,(ఆంధ్రజ్యోతి): ఇటీవల పరిగిరోడ్డు మోతుకపల్లి వద్ద ఆక్రమణకు గురైన స్థలంలో ఆక్రమణదారులు నాటిన రాళ్ళను ఆర్‌అండ్‌బి అధికారులు బుధవారం తొలగించారు. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారుల కన్ను అనే కథనానికి ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించారు. సిబ్బందితో వెళ్ళి ఆక్రమణదారులు నాటిన బండలను తొలగించారు. ప్రభుత్వ స్థలంలోని బండలు తొలగించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

చెన్నమల్లయ్య కిరీటం నిలిచేనా?



చెన్నమల్లయ్య

పావగడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10వతేదీన పాల ఉత్పాదకుల సంఘానికి జరిగే ఎన్నికల్లో భాగంగా సీనియర్ నాయకుడిగా పేరుగాంచిన చెన్నమల్లయ్యకు కిరీటం గుర్తు కేటాయించడంతో ఎమ్మెల్యే వర్గంతో పోటీపడి విజయం సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలిసింది. పావగడ నుండి డైరెక్టర్‌గా ఎన్నుకొనేందుకు కాంగ్రెస్ మద్దతుదారుడు బెళ్లిబెట్లు చంద్రశేఖర్‌రెడ్డి, జేడీఎస్ మద్దతుదారుడు ప్రస్తుత డైరెక్టర్ చెన్నమల్లయ్య ఈసారి జరగబోయే ఎన్నికల్లో తీవ్రంగా కృషి చేస్తున్నారు. గడిచిన ఐదు సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీ నుండి డైరెక్టర్‌గా ఎన్నికైన చెన్నమల్లయ్య, ఆపార్టీలో నెలకొన్న విబేధాలతో ఎమ్మెల్యే ఎన్నికల్లో జేడీఎస్ పార్టీలోకి చేరారు. అప్పటి నుండి ప్రతిపక్ష నాయకుడిగా మారిన చెన్నమల్లయ్య, వీఎస్ఎస్ఎన్ కార్యదర్శిగా కొనసాగుతూ ప్రస్తుతం ఆదివారం జరిగే ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారుడిగా ఎన్నికల బరిలో నిలిచారు.

తాలూకా వ్యాప్తంగా 66 పాల డెయిరీ కేంద్రాలు ఉండగా అందులో అత్యధికంగా పాలు పోసిన 57 పాల డెయిరీలకు ఓటు సభ్యత్వ నమోదు పత్రాన్ని(డెలిగేట్స్) ఇప్పటికే అందజేశారు. ఐదు సంవత్సరాల నుండి డైరెక్టర్‌గా కొనసాగిన చెన్నమల్లయ్యకు కిరీటం గుర్తు కేటాయించడంతో పరువు దక్కించుకొనేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా చంద్రశేఖర్‌రెడ్డి కూడా గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికే చెన్నమల్లయ్యకు 30 మంది సభ్యుల మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది. తనపై తీవ్ర విమర్శలు కురిపించిన ఎమ్మెల్యేను ఢీకొని చెన్నమల్లయ్య గెలిచేనా అనే విషయం చర్చనీయాంశంగా మారింది.

నేడు గోరంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

● వర్చువల్ పద్ధతిలో సీఎం చేతులమీదుగా

గోరంట్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.గొల్లపల్లివద్దనూతనంగా నిర్మించిన 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని బూదిలి పంచాయతీ గొల్లపల్లి వద్ద రూ.78.98కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. హిందూపురం విద్యుత్ ఉపకేంద్రంనుంచి 220 కెవి డిసి లైన్‌ద్వారా గోరంట్ల విద్యుత్ ఉపకేంద్రాన్ని అనుసంధానించడం ద్వారా గోరంట్ల, చిలమత్తూరు, పుట్టపర్తి మండలాలకు చెందిన లక్ష 50వేలమంది వినియోగదారులు లబ్ది పొందుతారన్నారు. ఈప్రారంభోత్సవానికి బిసి సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, అధికారులు హాజరవుతారన్నారు.

కోన కణ్వాశ్రమ కమిటీలు రద్దు

పెనుకొండ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం గుట్టూరు సమీపంలో వెలసిన శ్రీ కోనకణ్వాశ్రమంలో కమిటీలను భక్తాదుల సమక్షంలో అధికారులు రద్దుచేశారు. వివరాల్లోకెళితే గుట్టూరు సమీపంలోని కోన కణ్వాశ్రమం పీఠాధిపతిగా గత కొన్నేళ్లుగా విష్ణుదాస్ ఉండేవారు. ఆయన మృతిచెందడంతో ఆయన స్థానంలో కొంతమంది ట్రస్టీగా ఏర్పడి ఆలయానికి వచ్చే నగదు, వస్తువులు కాజేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో విషయం వివాదాస్పదంగా మారింది. ఆదివారం తహసీల్దార్ శ్రీధర్, ఎస్ఐ రమేష్, సిబ్బందితో వెళ్లి భక్తాదుల సమక్షంలో కమిటీలు రద్దుచేసి ప్రతినెలా ఆలయానికి ఎంత ఆదాయం వస్తుందో భక్తుల ముందు లెక్కచూపాలని తెలిపారు.

10న వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణ



మాట్లాడుతున్న వడ్డెర్ల సంఘం నాయకులు

మడకశిరటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఈనెల 10వతేదీన కదిరి పట్టణంలో ఆవిష్కరించనున్నట్లు వడ్డెర్ల సంఘం నాయకులు నాగరాజు, అక్కంపల్లి బాబు, వడ్డే రఘురాం, తదితరులు కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్.అండ్.బి. అతిథి గృహంలో వడ్డెర్ల సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ఆయన ఎన్నో పోరాటాలు చేశారన్నారు. జిల్లా పరిధిలోని వడ్డెర్ల సంఘం నాయకులు కదిరిలో జరిగే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సుబ్బరాయుడు, దేవరాజు, రామచంద్రతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి పరామర్శ



గాయపడిన మల్లిని పరామర్శిస్తున్న నాయకులు

సోమందేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరు సమీపంలో ఆర్టీఓ చెకోపోస్టువద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మల్లిని బుధవారం స్థానిక టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర, వడ్డె సురేష్ తదితరులు పరామర్శించారు. స్థానికంగా గీతానగర్‌లో నివాసముండే క్షతగాత్రుడు మల్లిని తన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పరిస్థితులపై ఆరాతీశారు. పార్టీ అండగా ఉంటుందని ఓదార్చారు. అనంతరం మంత్రి సవిత ఫోన్ ద్వారా క్షతగాత్రుడిని పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతికి ఆర్డీటీ కృషి



మాట్లాడుతున్న ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్

గుడిబండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆర్డీటీ సంస్థ కృషి చేస్తుందని రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కేజీఎన్‌పాళ్యం గ్రామంలో ఆర్డీటీ సంస్థ నిర్మించిన ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరికి ఇల్లు అవసరం అన్నారు. ఇల్లు ఉంటేనే సమాజంలో విలువలు, గౌరవం ఉంటాయన్నారు. పేద ప్రజలు, విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం అన్నారు. అనంతరం ఇళ్లను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఏటీఎల్ మీనాక్షి, ఆర్డీటీ బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

గోరంట్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజాపురం వద్ద ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడిన చిన్న ఆదిమూర్తి (17) బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. మండలంలోని కరావులపల్లి వద్ద సంచార జాతికి చెందిన చిన్న ఆదిమూర్తి గత కొన్నేళ్లుగా నివాసముంటున్నాడు. అతడు ఈనెల 1వతేదీన ద్విచక్రవాహనంపై గోరంట్లకు వస్తుండగా ఖాజాపురం వద్దరోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని తీవ్రవంగా గాయపడ్డాడు.. వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స అనంతరం హిందూపురం, బెంగుళూరు విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి చిన్నాన్న కందుకూరి గంగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.